సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 23 । అక్టోబర్ । 2024



కిలో టమాట రూ.40

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.40, కనిష్టంగా రూ.23, సరాసరిన రూ.33 ప్రకారం ధర పలికింది.



నాగార్జునకు ఘన స్వాగతం

అనంతపురంలోని ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు విమానంలో సత్యసాయి విమానాశ్రయం చేరుకున్న హీరో నాగార్జునకు ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

గరిష్టం/కనిష్టం

34.2°/22.3°

జిల్లాలో మంగళవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. భారీ వర్షం కురిసినా పగలు ఉక్కపోత నెలకొంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై పలుచోట్ల వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్ సూచన



ప్రశాంతి నిలయం: భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు కూడా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. మంగళవారం ఆయన తన క్యాంప్ కార్యాలయం నుంచి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ, ఎగువ రాష్ట్రం కర్ణాటకలోనూ భారీ వర్షాలు కురుస్తున్నందున అక్కడి నుంచి జిల్లాకు వచ్చే వాగులు, వంకలు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో ఉంటున్న వారంతా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, ఇందుకు అధికారులు తగు ఏర్పాట్లు చేయాలన్నారు.

భారీ వర్షాలతో జాగ్రత్త



ఎస్పీ రత్న

పుట్టపర్తి అర్బన్: రానున్న నాలుగు రోజులూ జిల్లాకు భారీ వర్ష సూచన ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రత్న సూచించారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా కుంటలు, వాగులు, నదులు పొంగి ప్రవహిస్తున్నాయని, ప్రజలు వాటి సమీపంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంగళవారం పలు ప్రాంతాల్లో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై వర్షపునీరు పారడంతో రాకపోకలకు అంతరాయం కలిగిందని, వెంటనే ఆయా ప్రాంతాల్లోని పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసి వాహనదారులు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. కర్ణాటక ప్రాంతంలోని పరగోడు నిండి మరువ పారుతుండటంతో చిత్రావతి నది పరీవాహక ప్రాంతాల్లో ఉంటున్న వారంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నివాసం ఉంటున్న వారు వెంటనే సురక్షితమైన ప్రాంతాలకు చేరుకోవాలని ఎస్పీ రత్న సూచించారు.

35 మేక పిల్లలు మృతి



మృతి చెందిన మేక పిల్లలు

ముదిగుబ్బ: భారీ వర్షానికి ఉరుములు, మెరుపులుతోడు కావడంతో మండల పరిధిలోని పొడరాళ్లపల్లిలో జయమ్మ అనే గొర్రెల కాపరికి చెందిన 35 మేక పిల్లలు మృతి చెందాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరారు.



బత్తలపల్లి : సంగమేశ్వరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న చిత్రావతి నది



పుట్టపర్తి: భారీ వర్షంతో జగరాజుపల్లి వద్ద పొలంలోనే కుళ్లిన వేరుశనగ పంట



ఎన్‌పీకుంట: పూర్తిగా నిండి మరువపారుతున్న పెడబల్లి జలాశయం

కుంభవృష్టి

ఉరుములు...మెరుపులు..పిడుగులతో కూడిన గాలీవాన బీభత్సం చేసింది. సోమవారం రాత్రి 10 గంటల తర్వాత ప్రారంభమైన వాన మంగళవారం తెల్లవారుజాము వరకూ కుంభవృష్టిగా కురిసింది. వాగులు, వంకలు పోటెత్తగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో జాతీయ రహదారులపై వరద పారడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. భారీ వర్షాలతో పలుచోట్ల పంట, ఆస్తి నష్టం సంభవించింది. ఖరీఫ్ పంటలన్నీ తుడిచిపెట్టుకుపోగా రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



చెన్నేకొత్తపల్లి మండలం వెల్దుర్తి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న చిత్రావతి నది

జిల్లాలో కుమ్మేసిన వాన

- ఒక్కరోజే 59.4 మి.మీ సగటు వర్షపాతం
- అత్యధికంగా కనగానపల్లిలో 198 మి.మీ వర్షం
- పరవళ్లు తొక్కుతున్న నదులు, వంకలు
- రోడ్లపై నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం
- తీవ్ర ఇబ్బందులు పడిన వాహనదారులు
- కొట్లపల్లి వద్ద రెండు బైకులు గల్లంతు
- పెద్ద ఎత్తున పంటలకు నష్టం

పుట్టపర్తి అర్బన్: వరుణుడు ఉగ్రరూపం దాల్చాడు. ఉరుములు, మెరుపులతో జిల్లాపై విరుచుకుపడ్డాడు. సోమవారం రాత్రి 10 గంటలకు మొదలైన వరుణ హోరు తెల్లవార్లూ కొనసాగింది. భారీ వర్షానికి బలమైన గాలులు తోడు కావడంతో పలు మండలాల్లో భారీ వర్షపాతం నమోదైంది. వాగులు, వంకలు, చెక్ డ్యాంలతో పాటు చిత్రావతి, వంగపేరు, కుషావతి, జయమంగళి నదులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో ప్రధాన రోడ్లపై రాకపోకలు స్తంభించాయి.

అర్ధరాత్రి నుంచే అష్టకష్టాలు

వరుణుడి ధాటికి సోమవారం అర్ధరాత్రి నుంచే జనం అష్టకష్టాలు పడ్డారు. భారీ వర్షంతో నదులు ఉప్పొంగాయి. ఫలితంగా పెనుకొండ వద్ద జాతీయ రహదారి పైకి నీరు చేరడంతో గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోయాయి. పెనుకొండ నుంచి కొట్లపల్లికి వస్తున్న కియా ఉద్యోగులు కుమార్‌రెడ్డి, రాధాకృష్ణ అర్ధరాత్రి 2 గంటల సమయంలో వంగపేరు ప్రవాహాన్ని అంచనా వేయలేక వాగులో చిక్కుకున్నాయి. వారి పల్సర్ బైకులు గల్లంతుకాగా, అష్టకష్టాలు పడి వారు గట్టుకు చేరారు. ఇక చిత్రావతి నది ఉప్పొంగడంతో పెడపల్లి, రాయలవారిపల్లి, కోవెలగుట్టపల్లి వద్ద నదిని దాటలేక పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సీజన్‌లో తొలిసారి ధర్మవరం చెరువు పూర్తిగా నిండి మరువపారింది.

300 వేరుశనగ వర్షార్పణం

వర్షంతో రామగిరి మండల రైతులు రూ.లక్షల విలువైన పంటలు కోల్పోయారు. మండలంలోని అక్కంపల్లి చెరువు మరువపారడంతో కింది భాగంలో రోడ్డుపై ఆరబోసిన 300 బస్తాల వేరుశనగ కాయలు పూర్తిగా కొట్టుకు పోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రూ.10 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు వారు తెలిపారు.

కనగానపల్లి కకావికలం

జిల్లాలోని 32 మండలాల పరిధిలో వర్షం కురిసింది. ఒక్కరోజు పరిధిలోనే 1902.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. అత్యధికంగా కనగానపల్లి మండలంలో 198.2 మి.మీ భారీ వర్షపాతం నమోదుకాగా, మండల పరిధిలోని వాగులు, వంకలు పోటెత్తాయి. జనజీవనం పూర్తిగా స్తంభించింది. ఇక రామగిరి 98.4, సీకేపల్లి 95.4, పెనుకొండ 89.8, కొత్తచెరువు 88.2, హిందూపురం 88.2, ధర్మవరం 78.6, బుక్కపట్నం 76.2, ముదిగుబ్బ 72.4, అమడగూరు 72.2, సోమందేపల్లి 70.4, లేపాక్షి 70.2, బత్తలపల్లి 60.4, మడకశిర 58.6, తాడిమర్రి 56.4, ఓడీచెరువు 55.4, రొద్దం 55.2, నల్లచెరువు 52.4, అగళి 48.6, గోరంట్ల 48.4, పుట్టపర్తి 46.2, అమరాపురం 44.2, నల్లమాడ మండలంలో 41.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండల్లాలోనూ 18 నుంచి 35 మి.మీ వర్షపాతం నమోదైంది. ఒక్కరోజులోనే జిల్లాలో 59.4 మి.మీ సగటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఉధృతంగా ప్రవహించిన డూపులేట్ వాగు

- ధర్మవరం-బత్తలపల్లి మధ్య రాకపోకలు బంద్



ధర్మవరం-బత్తలపల్లి ప్రధాన రహదారిపై పోట్లమర్రి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న డూపులేట్ వాగు

బత్తలపల్లి: భారీ వర్షానికి మండల పరిధిలో డూపులేట్ వాగు, చిత్రావతి నది ఉధృతంగా ప్రవహించాయి. ఎగువ ప్రాంతాలైన కనగానపల్లి, రామగిరి మండలాల్లో భారీగా వర్షం కురవడంతో అక్కడ నుంచి నీరు బత్తలపల్లి మండలానికి చేరింది. దీంతో పోట్లమర్రి సమీపంలోని డూపులేట్ వాగులు (చిన్నవంక, పెద్దవంకలు) ఉధృతంగా ప్రవహించాయి. వాననీరు రోడ్డుపై చేరడంతో ధర్మవరం-బత్తలపల్లి మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోగా, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాగు దాటుతున్న క్రమంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇద్దరు కొట్టుకుపోతుండగా స్థానికులు, ఎస్‌ఐ శ్రీనివాసులు బయటకు తీసుకువచ్చారు. ధర్మవరం, గొట్లూరు చెరువులు నిండి మరువపారడంతో రెండు చెరువుల నీరు చిత్రావతిలో చేరింది. దీంతో నది పరవళ్లు తొక్కుతోంది.

1,146 హెక్టార్లలో పంట నష్టం



బత్తలపల్లి మండలం అప్పరాచెరువు వద్ద తడిసిపోయిన వేరుశనగ పంట

ప్రశాంతి నిలయం: రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో 130 గ్రామాల పరిధిలో 1,146 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని అధికారులు తెలిపారు. వరి, వేరుశనగ, మొక్కజొన్న, కంది, సామలు, కొర్రలు తదితరల పంటలకు ఎక్కువ నష్టం వాటిల్లిందన్నారు. అలాగే 46.47 హెక్టార్లలో ఉద్యాన పంటలు కూడా దెబ్బతిన్నాయన్నారు. ఇక జిల్లా వ్యాప్తంగా 57 మట్టి ఇళ్లు ధ్వంసమయ్యాయని, కనగానపల్లి గ్రామంలో 18 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని అధికారులు వెల్లడించారు. పశు సంపదకు సంబంధించి 3 పశువులు, 32 గొర్రెలు చనిపోగా రూ.2.27 లక్షల నష్టం వాటిల్లినట్లు పశు సంవర్ధక శాఖ అధికారులు వెల్లడించారు.

దెబ్బతిన్న రోడ్లు

భారీ వర్షాలతో జిల్లాలో 20 కిలోమీటర్ల మేర రోడ్డు ఉపరితలం దెబ్బతినిందని రోడ్లు, భవనాల శాఖ అధికారులు తెలిపారు. కొన్నిచోట్ల రోడ్లు పాక్షికంగా దెబ్బతినగా రూ.1.20 కోట్ల నష్టం జరిగిందన్నారు. ఇక కొన్ని రోడ్లు పూర్తిగా ధ్వంసం కాగా, రూ.22 కోట్లు నష్టం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి రెండు చోట్ల నిర్మాణాలు దెబ్బతినగా రూ.57.5 లక్షల నష్టం వాటిల్లిందని ఆశాఖ అధికారులు వెల్లడించారు.

జాతీయ రహదారిపై పారిన నీరు

- బెంగళూరు మార్గంలో 3 గంటల పాటు రాకపోకలు బంద్



జాతీయ రహదారిపై వర్షపునీటిలో ఆగిపోయిన బస్సును జేసీబీతో ఒడ్డుకు చేరుస్తున్న పోలీసులు



జాతీయ రహదారిపై పారుతున్న వర్షపు నీరు

పెనుకొండ రూరల్: సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి 44వ జాతీయ రహదారిపై నీరు పారింది. ఎగువన ఉన్న కొండ ప్రాంతాల నుంచి వెంకటగిరిపాళ్యం గ్రామం చెరువులోకి భారీగా వర్షపు నీరు చేరగా...చెరువు మరువపారింది. ఆ నీరంతా సోమవారం అర్ధరాత్రి సమయంలో గుట్టూరు వై జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై పారింది. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు 3 గంటలు పాటు ట్రాఫిక్ స్తంభించింది. దాదాపుగా 5 కిలోమీటర్లు మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న కియా ఎస్‌ఐ రాజేష్, సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. జేసీబీల సాయంతో సహాయక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్‌ను నియంత్రించి రవాణాకు ఇబ్బందులు కలగకుండా చేశారు.

కొత్తచెరువు-ధర్మవరం మార్గంలో రాకపోకలకు అంతరాయం

పుట్టపర్తి: భారీ వర్షానికి కొత్తచెరువు మండలంలో ప్రధాన నది వంకపేరు పొంగి ప్రవహిస్తోంది. మంగళవారం కొత్తచెరువు-ధర్మవరం మార్గంలో రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరకుంటపల్లి వద్ద కూడా వంకపేరు బ్రిడ్జిపై నీరు ప్రవహిస్తుండటంతో కొత్తచెరువు- మరకుంటపల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.



పరిగి మండలం శ్రీరంగరాజుపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న జయమంగళి నది



మడకశిర మండలం కేతేపల్లిలో మిరప పంటలో నిలిచిన వర్షపునీరు



దాదులూరు పోతలయ్య స్వామి ఆలయ ఆవరణలో చేరిన వర్షపు నీరు



గుడిబండ మండలంలో భారీ వర్షానికి దెబ్బతిన్న వేరుశనగ పంట

అక్రమ కేసులు బనాయిస్తే ఊరుకోం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్
- రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన నడుస్తోందని మండిపాటు



పోలీసులతో వాదిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

గోరంట్ల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టానికి లోబడి పనిచేస్తూ ప్రజలను కాపాడాల్సిన పోలీసులు కూడా అధికార పార్టీ నేతలు చెప్పిన మాటలు విని అమాయకులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఇకపై అక్రమ కేసులు బనాయిస్తే ఊరుకునేది లేదన్నారు. పోలీసులు తీరు మార్చుకోకపోతే రానున్న రోజుల్లో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. మంగళవారం ఆమె గోరంట్ల పోలీసు స్టేషన్‌కు వచ్చారు. మూడు రోజుల క్రితం మండల పరిధిలోని గడ్డంతండాలో వైఎస్సార్ సీపీ కార్యకర్త వినోద్‌కుమార్ వివాహ వేడుకల సందర్భంగా ఊరేగింపు ఏర్పాటు చేసుకోగా, అధికార పార్టీ నేతల ఒత్తిడిలకు తలొగ్గి పోలీసులు అడ్డుకోవడంతో పాటు కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారు. ఈ కేసు విషయమై స్థానిక ఎస్‌ఐ శ్రీనివాసులను ఆమె ఫోన్ ద్వారా ఆరా తీయగా... సమాచారం కావాలంటే పోలీసు స్టేషన్‌కు రావాలని బాధ్యతారాహిత్యంగా సమాధానం ఇచ్చారు. దీంతో ఉషశ్రీచరణ్ పార్టీ శ్రేణులతో కలిసి నేరుగా గోరంట్ల పోలీసు స్టేషన్‌కు వచ్చారు. కేసు వివరాలను ప్రతి పౌరునికీ అందించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్న విషయం గుర్తించాలని ఎస్‌ఐ శ్రీనివాసులుకు గుర్తు చేశారు. లా అండ్ ఆర్డర్‌ను కాపాడే పోలీసులు రెడ్‌బుక్ పాలన కొనసాగిస్తామంటే ఊరుకోబోమన్నారు. దీంతో సీఐ శేఖర్ కల్పించుకుని కేసు వివరాలు ఎస్‌ఐ చెప్పకపోవడం సరికాదని, మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఉషశ్రీ చరణ్, పార్టీ నేతలు అక్కడి నుంచి వెనుదిరిగారు. అంతకుముందు ఆమె పోలీసు స్టేషన్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు, హత్యలు పెరిగిపోయాయన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను అంతమొందించాలనే లక్ష్యంతో అధికార పార్టీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారని, అందుకు కొంతమంది పోలీసులు సైతం వంత పాడటం సిగ్గు చేటన్నారు. ఉషశ్రీచరణ్ వెంట జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాం నాయక్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి, పట్టణ కన్వీనర్ మేదర శంకర, పార్టీ ముఖ్య నాయకులు రఘురామిరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, గోరంట్ల ఉప సర్పంచ్ రాజారెడ్డి, మండల వ్యవసాయ సలహా కమిటీ మాజీ చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

‘పురం’ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహించాలి

- కలెక్టర్‌ను కోరిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్



పార్టీ నాయకులతో కలిసి కలెక్టర్ చేతన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉషశ్రీ చరణ్

ప్రశాంతి నిలయం: హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ తన పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో వెంటనే నూతన చైర్మన్ ఎన్నిక నిర్వహించి హిందూపురం అభివృద్ధికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ కలెక్టర్ టీఎస్ చేతన్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమె... హిందూపురం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చారు. హిందూపురం మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నిక త్వరగా నిర్వహించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఉషశ్రీచరణ్ విలేకరులతో మాట్లాడారు. హిందూపురం మున్సిపల్ కౌన్సిల్‌లో వైఎస్సార్ సీపీకే బలం ఉందని, అందువల్లే అధికార పార్టీ నేతల ఒత్తిడికి తలొగ్గిన మున్సిపల్ అధికారులు చైర్మన్ ఎన్నిక నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. అధికార పార్టీ నేతలు హిందూపురం అభివృద్ధి కంటే రాజకీయమే ముఖ్యంగా భావిస్తున్నారన్నారు. చైర్‌పర్సన్‌గా ఇంద్రజ పదవికి రాజీనామా చేసి మూడు నెలలైనా ఎన్నిక నిర్వహించకపోవడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. మున్సిపల్ చైర్మన్ లేకపోవడంతో హిందూపురం అభివృద్ధి కుంటుపడిందని, ఇది చంద్రబాబుకు కనబడలేదా అని ఆమె ప్రశ్నించారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ ప్రజలకు సమానంగా అందించిందని, ఏనాడూ ఇలాంటి రాజకీయాలు చేయలేదన్నారు. కలెక్టర్‌కు సమస్య వివరించామని, త్వరలోనే హిందూపురం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ హిందూపురం సమన్వయకర్త టీఎన్ దీపిక మాట్లాడుతూ, మున్సిపల్ కౌన్సిల్‌లో వైఎస్సార్ సీపీకే బలం ఉందని, వెంటనే చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని గత నెల 30న మున్సిపల్ కమిషనర్‌ను కౌన్సిలర్లు కోరినా పట్టించుకోలేదన్నారు. అందుకే కలెక్టర్‌ను కలిసి ఎన్నిక నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వేణురెడ్డి, హిందూపురానికి చెందిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, హిందూపురం, పెనుకొండ, కదిరి, పుట్టపర్తికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్



ప్రశాంతి నిలయం: స్వర్ణాంధ్ర -2047 విజన్ సాధనలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో ప్రతి శాఖ కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. వికసిత్ భారత్- 2047 వంద రోజుల కార్యాచరణపై మంగళవారం కలెక్టరేట్‌లో డ్వామా, డీఆర్‌డీఏ, పంచాయతీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్సీ సంక్షేమ, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టే పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. పని దినాలు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. యాక్షన్ ప్లాన్‌కు అనుగుణంగా పనులు పూర్తి చేయాలన్నారు. మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్ పనులు ఈ నెల 24 నాటికి పూర్తి చేయాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల మరమ్మతులు వేగవంతం చేసి, ప్రజా వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం అర్హుల జాబితాను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జునప్ప, పీఆర్ డీఈ మురళీకృష్ణ, డీపీఓ సమత, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల్లో బోధనా సామర్థ్యాల పెంపునకు కృషి

- రాష్ట్ర విద్యా పరిశోధక శిక్షణ తరగతుల రీజనల్ డైరెక్టర్ డాక్టర్ దండేపాల్



మాట్లాడుతున్న డాక్టర్ దండేపాల్

హిందూపురం: ఉపాధ్యాయులలో బోధనా సామర్థ్యాలు పెంపొందించేందుకు ఎల్ఎఫ్ఎన్ శిక్షణ ఎంతో దోహదపడుతుందని రాష్ట్ర విద్యా పరిశోధక శిక్షణా తరగతుల రీజనల్ డైరెక్టర్ డాక్టర్ దండేపాల్ అన్నారు. హిందూపురంలోని బిట్ కళాశాలలో శ్రీసత్యసాయి, నంద్యాల జిల్లాల ఉపాధ్యాయులకు జరుగుతున్న తొలి విడుత ఎల్ఎఫ్ఎన్ శిక్షణా తరగతులను మంగళవారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. శిక్షణ ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు విడుతలుగా శిక్షణ తరగతులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి, ఏఎంఓ మల్లిక్, ఎంఈఓలు గంగప్ప, ఆంజనేయులు నాయక్, ప్రసన్నలక్ష్మి, నాగరాజు, శేషాచలం, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

సొగసు చూడతరమా!



ప్రకృతి రమణీయ దృశ్యాలు మంగళవారం అనంత వాసులను కనువిందు చేశాయి. సూర్యోదయం సమయంలో అతి పెద్ద ఇంద్రధనస్సు ఆకట్టుకుంది. మేఘాలను చీల్చుకుంటూ ఉదయిస్తున్న సూర్యుడి లేలేత కిరణాలు తాకిన వాన చినుకులు అందాల హరివిల్లును ఆవిష్కరించడంతో చూపరులు తమ సెల్‌ఫోన్లలో బంధించి సంబరపడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

గొంతు కోసి... పెట్రోల్ పోసి తగులబెట్టి

- గుర్తు తెలియని వ్యక్తి దారుణహత్య
- నాలుగు రోజుల క్రితం జరిగినట్లుగా అనుమానాలు



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రొద్దం: గుర్తు తెలియని ఓ వ్యక్తిని గొంతు కోసి.. ఆపై పెట్రోల్ పోసి దహనం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ సంఘటన రొద్దం మండలం పెద్దిపల్లి- ఎల్‌జీబీనగర్ సమీపంలోని సత్తారుపల్లి ప్రధాన రహదారి పక్కన ఈత వనంలో చోటుచేసుకుంది. మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన పశువుల కాపర్లు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. నాలుగు రోజుల క్రితం ఘటన జరిగినట్లుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. సుమారు 30 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తిని తొలుత గొంతు కోసి హతమార్చారు. అనంతరం పెట్రోల్ పోసి నిప్పంటించారు. హతుడి మృతదేహం పాక్షికంగా కాలిపోయింది. నీలి రంగు నిలువు గీతలున్న తెలుపు రంగు ఫుల్ షర్ట్, తెల్ల రంగు బనియన్, బూడిద రంగు ప్యాంట్ ధరించాడు. కుడి చేతికి కాశీ దారం ఉంది. బెల్టు చెప్పులు వేసుకున్నాడు. కాగా, కొన్నేళ్లుగా ఈత వనంలో అసాంఘిక కార్యకాపాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. దట్టంగా ఈత చెట్లు పెరిగి ఉండడంతో పాటు ఇటు పెనుకొండ, అటు కర్ణాటకకు దగ్గర ప్రాంతం కావడంతో చాలా మంది ఇక్కడకు వచ్చి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు పాల్పడుతుంటారు. వివాహేతర సంబంధం కారణంగానే హత్య జరిగి ఉంటుందని, హతుడు కర్ణాటక ప్రాంతానికి చెందిన వాడై ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆచూకీ తెలిసిన వారు 94407 96841, 94409 01092కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ నాగేంద్ర విజ్ఞప్తి చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఐటీఐల్లో నాలుగో విడత అడ్మిషన్లు

లేపాక్షి: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో మిగులు సీట్ల భర్తీకి 4వ విడత అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టామని జిల్లా కన్వీనర్, లేపాక్షి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రాయపురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 26వ తేదీలోపు www. iti. ap. gov. in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. అభ్యర్థి దరఖాస్తు చేసుకున్న కళాశాలకు వెళ్లి ఒరిజనల్ సర్టిఫికెట్లను 27వ తేదీ సాయంత్రం 3 గంటల్లోపు వెరిఫై చేయించుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో వెరిఫై చేయించుకున్న వారు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హులన్నారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో 28వ తేదీన, ప్రైవేటు ఐటీఐ కళాశాలలో ఈ నెల 30వ తేదీన కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. వివరాలకు 9440285629, 9490445744, 8523831381 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నీట మునిగి పాడి రైతు మృతి

రొద్దం: ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ పాడి రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దం మండలం బొమ్మిరెడ్డిపల్లికి చెందిన రామాంజినరెడ్డి (60) పాడి పోషణతో జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న ఆయన సోమవారం తన పశువులను మేపు కోసం గ్రామ శివారులోని చెరువు వద్దకు తోలుకెళ్లాడు. సాయంత్రం పశువులు మాత్రమే ఇంటికి చేరుకున్నాయి. దీంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. మంగళవారం ఉదయం చెరువులో తేలియాడుతున్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. చెరువులో పశువులు మేస్తుండగా మూర్ఛ వచ్చి నీటి గుంతలో పడి మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

రాయదుర్గం టౌన్: వ్యక్తిని హతమార్చి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన కేసులో హతుడి కుమారుడిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వివరాలను మంగళవారం సీఐ జయనాయక్ వెల్లడించారు. రాయదుర్గంలోని సిద్దేశ్వర కాలనీకి చెందిన నాయకుల బొమ్మన్న(51) గత శనివారం రాత్రి పెదారగుడ్డం వద్ద ఉన్న తన తోట నుంచి పట్టణానికి వస్తుండగా కుమారుడు నాగరాజు అడ్డుపడి కొడవలితో నరికి హతమార్చిన విషయం తెలిసిందే. అనంతరం తండ్రి మృతదేహాన్ని ఆస్పత్రికి చేర్చి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తూ వాస్తవం బహిర్గతం కావడంతో అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో మెచ్చిరి రోడ్డులోని చింత తోపులో ఉన్న నాగరాజును మంగళవారం అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన మచ్చు కొడవలి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

యువకుడి దుర్మరణం



మృతుడు భానుప్రకాష్‌రెడ్డి

నార్పల: ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... నార్పలలోని సుల్తాన్‌పేటకు చెందిన నొస్సం రామచంద్రారెడ్డి కుమారుడు భానుప్రకాష్‌రెడ్డి (19) తన స్నేహితులు సతీష్, ప్రణీత్‌తో కలసి మంగళవారం గూగూడుకు వెళ్లాడు. అనంతరం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన వారు నార్పల శివారులోకి చేరుకోగానే గూగూడు వైపు నుంచే అతి వేగంతో వస్తున్న ట్రాక్టర్ ఢీ కొంది. భానుప్రకాష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సతీష్, ప్రణీత్‌ను స్థానికులు వెంటనే జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై నార్పల పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి



మృతుడు మారెన్న

గుమ్మఘట్ట: విద్యుత్ షాక్‌కు గురై ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం కోనాపురం గ్రామానికి చెందిన మారెన్న (60)కు భార్య నీలమ్మ, ఓ కుమార్తె ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి 12 గంటల తర్వాత గ్రామంలో భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో మారెన్న ఇంటికి అనుసంధానం చేసిన విద్యుత్ సర్వీస్ లైన్ తెగి కిందకు పడింది. మంగళవారం తెల్లవారుజామున విషయాన్ని గుర్తించిన మారెన్న తీగలను పక్కకు తొలగిస్తుండగా షాక్‌కు గురై కుప్పకూలాడు. గమనించిన స్థానికులు, కుటుంబసభ్యులు వెంటనే గుమ్మఘట్టలోని పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

25న మడకశిరలో మెగా జాబ్‌మేళా

మడకశిర: స్థానిక ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 25న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హేమలత మంగళవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ మేళాలో వివిధ 8 కంపెనీలకు ప్రతినిధులు పాల్గొని ఆయా కంపెనీల అవసరాలకు మానవ వనరులను ఎంపిక చేయనున్నారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసున్న యువతీయువకులు అర్హులు. పది, ఇంటర్, డిప్లొమో, డిగ్రీ, పీజీ పూర్తి చేసి ఉండాలి. ఎంపికైన వారు బెంగళూరు, హైదరాబాద్, అనంతపురం, హిందూపురం, పెనుకొండ తదితర ప్రాంతాల్లో పని చేయాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీయువకులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చు.

పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



హిందూపురం అర్బన్: స్థానిక జీఆర్పీ పరిధిలోని మలుగూరు-హిందూపురం స్టేషన్ల మధ్య పట్టాలపై ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ బాలాజీ నాయక్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. గుడ్డం దేవాలయం సమీపంలో మంగళవారం వేకువ జామున బెంగళూరు-పెనుకొండ వైపు నడిచే రైలు కింద పడి మృతి చెందినట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. మృతుడికి దాదాపు 30 ఏళ్ల వయస్సు ఉంటుందని, కుడిచేతిపై అమ్మ అనే పచ్చబొట్టు ఉందన్నారు. అయితే మృతుడు ఆత్మహత్య చేసుకున్నాడా? లేదా ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతిచెందాడా? అనేది తేలాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 04699కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎండుమిర్చికి వాన దెబ్బ

- తగ్గిన ధరలు.. ఆందోళనలో రైతులు

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి రైతుల ఆశలన్నీ వర్షార్పణమయ్యాయి. పంట రెండు వారాల క్రితం మార్కెట్‌లో మొదటి రకం మిర్చి క్వింటా రూ.19 వేలు పలుకగా, ప్రస్తుతం క్వింటాకు రూ.15 వేలకు మించి రైతుకు దక్కడం లేదు. హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం 136 మంది రైతులు 190 క్వింటాళ్ల ఎండు మిర్చి తీసుకురాగా, మొదటి రకం క్వింటా రూ. 15,100, రెండో రకం క్వింటా రూ. 10 వేలు, మూడో రకం క్వింటా రూ.7 వేలు పలికినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. ధరల పతనంతో ఎండుమిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు.

నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు

అనంతపురం టవర్‌క్లాక్: నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలను అందజేయనున్నారు. ఈ మేరకు నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట రంగయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2023-24 విద్యా సంవత్సరానికి గాను పదో తరగతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 450కు పైగా, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 520కు పైగా మార్కులు సాధించిన వారు అర్హులు. అలాగే ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు 850, ప్రైవేట్ కళాశాల విద్యార్థులు 900కు పైగా మార్కులు సాధించి ఉండాలి. అర్హులైన విద్యార్థులు దరఖాస్తులను పూరించి అనంతపురంలోని జయమణెమ్మ కల్యాణమంటపంలో అందజేయాలి. అర్హులకు నవంబర్ 24న ప్రతిభ పురస్కారాలు అందజేస్తారు. వివరాలకు 94405 01463, 94412 22874లో సంప్రదించవచ్చు.

స్పాట్ బిల్లింగ్ టెం'డర్'

- ఉమ్మడి జిల్లాలో 25సబ్ డివిజన్లకు 413 టెండర్లు
- జిల్లా మొత్తానికి ఒకరు చొప్పున ఉమ్మడి జిల్లాలో ఇద్దరికి కేటాయింపు
- విద్యుత్ శాఖ అధికారుల ఏకపక్ష నిర్ణయంతో విస్తుబోయిన టెండర్‌దారులు



విద్యుత్ సంస్థ కార్యాలయం

అనంతపురం టౌన్: విద్యుత్ మీటర్ల రీడింగ్ తీసేందుకు (స్పాట్ బిల్లింగ్) విద్యుత్ శాఖ అధికారులు చేపట్టిన టెండర్ల నిర్వహణ ఏకపక్షంగా సాగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 25 విద్యుత్ సబ్ డివిజన్ల పరిధిలో స్పాట్ బిల్లింగ్ తీసేందుకు ఇటీవల టెండర్లను పిలిచారు. మొత్తం 413 టెండర్లు దాఖలయ్యాయి. విద్యుత్ సంస్థ నిర్ణయించిన ధరలో తక్కువ మొత్తానికి టెండర్ వేసిన దరఖాస్తుదారునికి ఖరారు చేయాల్సి ఉండగా. నిబంధనలు తుంగలో తొక్కి అనంతపురం జిల్లాను ఒకరికి, శ్రీసత్యసాయి జిల్లాను మరొకరికి కేటాయించారు. ఎలాంటి అనుభవం లేని వ్యక్తులకు స్పాట్ బిల్లింగ్ టెండర్ కేటాయించడం వెనుక అంతర్యం ఏమిటన్నది విద్యుత్ శాఖ అధికారులకే తెలియాలి.

కాంట్రాక్టర్లకు తెలియకుండానే టెండర్ల ఓపెన్

స్పాట్ బిల్లింగ్ టెండర్ నిబంధనలకు జిల్లా అధికార యంత్రాంగం పాతరేసింది. జిల్లా వ్యాప్తంగా 13 లక్షల విద్యుత్ సర్వీసులున్నాయి. వీటికి ప్రతి నెలా 1 నుంచి 7వ తేదీలోపు బిల్లులు తీసి వినియోగదారులకు అందించేందుకు ఒక సర్వీసుకు అర్బన్ ఏరియాలో రూ.5.49పైసలు, రూరల్ పరిధిలో రూ.5.68పైసలు చొప్పున నిర్ణయించారు. దీంతో పాటు సూపర్ వైజర్ సర్వీస్ కింద 5 శాతం అదనంగా టెండర్ దాఖలు చేసుకోవచ్చు. దీంతో కాంట్రాక్టర్లు ప్రతి సబ్ డివిజన్‌కు 10కి పైగా టెండర్లను దాఖలు చేశారు. మొత్తంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 413 టెండర్లు విద్యుత్ సంస్థ కార్యాలయానికి చేరాయి. సోమవారం సాయంత్రం విద్యుత్ శాఖ అధికారులు కాంట్రాక్టర్లకు తెలియకుండా టెండర్లను ఓపన్ చేసి ఇద్దరు వ్యక్తులకు కేటాయించి చేతులు దులుపుకున్నారు.

నిబంధనలకు పాతర

ప్రతి టెండర్ దరఖాస్తుదారుడు విద్యుత్ శాఖ పేర్కొన్న ధరకే (అర్బన్ రూ.5.59, రూరల్ 5.68పైసలు) టెండర్లను కోట్ చేశారు. ఇందులో ఎలాంటి సూపర్ వైజర్ చార్జీలు లేవు. అందరూ ఒకే ధరకే కోట్ చేశారు. ఇలాంటి తరుణంలో టెండరు దాఖలు చేసిన వారి సమక్షంలో సబ్ డివిజన్ల వారీగా లాటరీ తీసి స్పాట్ బిల్లింగ్ కాంట్రాక్ట్‌ను కేటాయించాలని విద్యుత్ సంస్థ నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. అయితే అధికారులు ఈ నిబంధనలు పాటించకుండా ఉమ్మడి జిల్లాను ఇద్దరి వ్యక్తులకు కేటాయించడంతో పాటు అగ్రిమెంట్ల ప్రక్రియనూ శరవేగంగా పూర్తి చేసేశారు. విద్యుత్ శాఖ అధికారుల ఏకపక్ష నిర్ణయంతో టెండర్‌దారులు విస్తుబోయారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్‌ను వివరణ కోరగా... 'స్పాట్ బిల్లింగ్ టెండర్లు ఓపెన్ చేసిన మాట వాస్తవమే. సబ్ డివిజన్ల వారీగా స్టడీ చేస్తున్నాం.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పాట్ బిల్లింగ్ కాంట్రాక్ట్‌ను కేటాయిస్తాం' అని దాటవేశారు.

'అనంత'లో కళ్యాణ్ జ్యువెలర్స్ ప్రారంభం



ప్రారంభోత్సవానికి విచ్చేసిన నాగార్జున

అనంతపురం కార్పొరేషన్: భారతదేశంలోనే అతి పెద్ద, విశ్వసనీయమైన బంగారు ఆభరణాల బ్రాండ్‌లలో ఒకటైన కళ్యాణ్ జ్యువెలర్స్ తన నూతన శాఖను అనంతపురంలోని సూర్యానగర్‌లో మంగళవారం ప్రారంభించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ నటుడు అక్కినేని నాగార్జున హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ అభిమాన హీరోను చూసేందుకు భారీ సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో సూర్యానగర్ ప్రాంతం జనసంద్రమైంది. ఈ సందర్భంగా కళ్యాణ్ జ్యువెలర్స్ బ్రాండ్ అంబాసిడర్ అక్కినేని నాగార్జున మాట్లాడుతూ... ట్రస్ట్ ఈజ్ ఎవ్రీథింగ్ నినాదంతో కంపెనీ చూపుతున్న నిబద్ధత వారిని ప్రత్యేకంగా నిలుపుతోందన్నారు. అనంతపురం ప్రజలను ఇలా కలిసే అవకాశం దక్కిండంపై హర్షం వ్యక్తం చేశారు. ధన్‌తేరస్, దీపావళి పర్వదినాలతో సమానంగా ప్రారంభోత్సవం జరిగిందన్నారు. ఇక్కడ ఆభరణాల ప్రేమికులు ఇకపై ప్రపంచ స్థాయి వాతావరణంలో సేవా ఆధారిత షాపింగ్ అనుభవాన్ని ఆస్వాదించవచ్చునన్నారు. కళ్యాణ్ జ్యువెలర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ కళ్యాణరామన్ మాట్లాడుతూ... ఒక కంపెనీగా, తాము అనేకమైన మైళ్లను అధిగమిస్తూ వచ్చామన్నారు. కస్టమర్ షాపింగ్ అనుభవాన్ని మెరుగు పరిచేందుకు అవసరమైన రీతిలో సమగ్ర పర్యావరణ వ్యవస్థను నిర్మించడంలో గణనీయమైన పురోగతిని సాధించినట్లు పేర్కొన్నారు. దీపావళి బొనాంజా ఆఫర్‌లో భాగంగా బంగారు ఆభరణాల తయారీపై చార్జీల తగ్గింపు ఇస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మల్లికార్జున (ఫైల్)

బుక్కరాయసముద్రం: అప్పు చెల్లింపు విషయంగా గొడవపడి కొట్టుకుని రాజీ అయిన అనంతరం ఓ వ్యక్తి ఉన్నఫళంగా కుప్పకూలి మృతి చెందాడు. ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. వివరాలు... బీకేఎస్ మండలం కొట్టాలపల్లికి చెందిన మల్లికార్జున (36)కు భార్య మల్లేశ్వరి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్న మల్లికార్జున... తన అవసరాల నిమిత్తం గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన రఫీ వద్ద రూ.30 వేలు అప్పుగా తీసుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం అప్పు చెల్లింపు విషయంగా బీకేఎస్ పరిధిలోని తడకలేరు బ్రిడ్జి వద్ద రఫీ, మల్లికార్జునతో పాటు మరికొందరు సమావేశమై పంచాయితీ నిర్వహించారు. ఆ సమయంలో మాటామాట పెరిగి ఇరువర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుని పరస్పరం కొట్టుకున్నాయి. అనంతరం రాజీ పడి ప్రతి నెలా కొంత మొత్తం చొప్పున చెల్లించేలా ఒప్పందం చేసుకుని, టీ తాగేందుకు కొట్టు వద్దకెళ్లారు. టీ ఆర్డర్ ఇస్తుండగానే మల్లికార్జున కుప్పకూలాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'పెండేకల్లు'కు నీటి విడుదల

పెద్ద పప్పూరు: చాగల్లు జలాశయం నుంచి మంగళవారం రాత్రి 150 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న పెండేకల్లు జలాశయానికి విడుదల చేశారు. ఈ మేరకు హెచ్చెల్సీ జేఈ హరి తెలిపారు.

'ఓపెన్ స్కూల్'ను సద్వినియోగం చేసుకోండి

- ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్



మాట్లాడుతున్న గోవిందనాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ విజ్ఞప్తి చేశారు. ఓపెన్ స్కూళ్ల నిర్వహణపై సంబంధిత కో-ఆర్డినేటర్లతో అనంతపురంలోని పొట్టి శ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన సమీక్షించారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పది, ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల 31 నాటికి గడువు ముగుస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 2,300 అడ్మిషన్లు అయ్యాయన్నారు. ఈ సంఖ్య మరింత పెంచేలా చూడాలన్నారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 25వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ. 200 అపరాధ రుసుంతో ఈ నెల 26 నుంచి 29 వరకు, రూ.500 అపరాధ రుసుంతో 30, 31తేదీల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పదో తరగతిలో చేరడానికి 14 సంవత్సరాలు నిండిన వారు, ఇంటర్‌లో చేరడానికి పదో తరగతి పాస్ అయి 15 సంవత్సరాలు నిండిన వారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు.

పీఆర్సీ కమిటీ, ఐఆర్ ప్రకటనను ఆమోదించాలి

- ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ డిమాండ్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి పీఆర్సీ కమిటీ, ఐఆర్ ప్రకటనతో పాటు సీపీఎస్, 117 జీఓ రద్దు అంశాలను రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయనతో పాటు జిల్లా ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి నరసింహులు మాట్లాడారు. 11వ పీఆర్సీ ముగిసి 14 నెలలవుతోందని, ఇప్పటి వరకూ ఐఆర్ ప్రకటన చేయకపోవడం బాధాకరమన్నారు. ఓపీఎస్ అమలుపై కేబినేట్ నిర్ణయం కోసం సీపీఎస్ బాధితులు ఎదురు చూస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాల రంగాన్ని అతలాకుతలం చేస్తున్న జీఓ 117 రద్దుకు కేబినేట్ ఆమోదం తెలపాలన్నారు. తల్లికి వందనం పేరుతో ఇచ్చే ఆర్థిక లబ్ధిని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలన్నారు. 12 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఎస్జీటీలను స్కూల్‌అసిస్టెంట్లుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం మేరకు ఉపాధ్యాయులు-విద్యార్థుల నిష్పత్తి నిర్ణయించాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ శిక్షణలో ఉపాధ్యాయుల ఇబ్బందులను తెలుసుకుని రానున్న రోజుల్లో జరిగే శిక్షణలను వాయిదా వేయాలని కోరారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్, నాయకులు రమణ, సర్దార్‌వలి, రామకృష్ణ, వన్నప్ప పాల్గొన్నారు.